ఏకత్వాన్ని చాటిచెప్పేలా లోక్‌మంథన్

● పాలమూరు యూనివర్సిటీ వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 21: సాంస్కృతిక ఏకత్వాన్ని చాటి చెప్పే అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవం (లోక్‌మంథన్) అని పీయూ వీసీ శ్రీనివాస్ అన్నారు. గురువారం పీయూలో అంతర్జాతీయ జానపద మేళాకు సంబంధించిన బ్రోచర్లు పూర్వ వీసీ డా.లక్ష్మీకాంత్ రాథోడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చలు జరపడం, వాటి పరిష్కారం కోసం ఆలోచనా విధానాన్ని రూపొందించి అందుకు అనుగుణంగా వ్యవస్థ ఏర్పాటు చేయడం లోక్‌మంథన్ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ ఆచార్య చెన్నప్ప, ఓఎస్డీ టూ వీసీ మధుసూదన్ రెడ్డి రామకృష్ణ సేవా సమితి రాజమల్లేశ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్, రాజశేఖర్, శ్రీధర్ రెడ్డి భాస్కర్ పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్‌తో అభివృద్ధి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 21: కాలానికి అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంతో పరిశోధనలు విద్యారంగ అభివృద్ధి, సామాజిక వ్యవస్థ, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు త్వరితగతిన అభివృద్ధి సాధిస్తాయని పీయూ వీసీ శ్రీనివాస్ అన్నారు. గురువారం పీయూ అర్థశాస్త్ర విభాగం అధ్యాపకుడు డా.బీవీ.రాఘవేందర్ రచించిన 'మైగ్రేన్ట్స్-ఏఐ, ఏఐ ఇంపాక్ట్ ఆన్ అగ్రికల్చర్ సెక్టార్, లేబరర్స్ అనే పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం పుస్తక రచయితను ఓఎస్డీటూ వీసీ మధుసూదన్‌రెడ్డి, జేడీ భాస్కర్, విభాగాల అధిపతులు తదితరులు అభినందించారు.

బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీనివాస్, పూర్వపు వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, అధ్యాపకులు

కులాలు ఐకమత్యంగా ఉంటేనే బలం

● సదర్ ఉత్సవంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, నవంబర్ 21: అన్ని కులాల వారు ఐకమత్యంగా ఉంటేనే బలమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బోయపల్లిలో శ్రీమల్లికార్జున యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సదర్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి హాజరయ్యారు. ముందుగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతి పండుగను అధికారింగా నిర్వహించాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారని గుర్తు చేశారు. ప్రజలందరూ కలిసికట్టుగా ఉంటేనే ఏదైనా సాధించగలుగుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో యాదవులకు గొర్రెల పంపిణీ చేశామని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా గొర్రెల పంపిణి కార్యక్రమం చేపట్టి యాదవులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మాజీ ముడా డైరెక్టర్ సాయిలు యాదవ్, శ్రీ మల్లికార్జున యాదవ సంఘం సభ్యులు, జిల్లా యాదవ సోదరులు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు పరామర్శ

మహబూబ్‌నగర్ టౌన్, నవంబర్ 21: రోడ్డు ప్రమాదంలో గాయపడి మహబూబ్‌నగర్ నేహాప్లైన్ దవాఖానలో చికిత్స పొందుతున్న కురువ సంఘం అధ్యక్షుడు సూధ నర్సింహులు యాదవ్‌ను మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సింహులు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

నాటక రంగానికి కొత్త ఊపిరి తీసుకురావాలి

చక్రధర్‌ను శాలువాతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

● మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, నవంబర్ 21: తెలంగాణలో నాటక రంగానికి కొత్త ఊపిరి తీసుకొచ్చి పునర్జీవం పోసే విధంగా కళాకారులు ముందుకొచ్చి కళను బతికించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య పేట జిల్లా అధ్యక్షుడిగా మక్తల్ మండలం కర్నికి చెందిన సంగోజీ చక్రధర్ ఇటీవల నియామకమయ్యాడు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో చక్రధర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సురేశ్, కళాకారులు సాయిలు, లక్ష్మణ్, రవికుమార్, నాగేశ్, హోంగార్డు లింగప్ప, ఊట్కూరు బాలరాజుతోపాటు తదితరులు ఉన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

● నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతమ్


మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, నవంబర్ 21: జిల్లాలో శాంతి భద్రతలు పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, నేరాలు జరిగిన వెంటనే తగిన సాక్ష్యాధారాలను సేకరించి సాంకేతిక పరిజ్ఞానంతో కేసులను త్వరగా ఛేదించాలన్నారు. కేసుల విచారణ పారదర్శకంగా చేయాలన్నారు. పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని, పాత నేరస్తులపై దృష్టి పెట్టాలన్నారు. సామాజిక అంశాలు, సీసీ కెమెరాల ఉపయోగాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య, సీఐలు శివశంకర్, దస్రునాయక్, రాంలాల్, చంద్రశేకర్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాజు, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పోషకాలతో కూడిన భోజనాన్ని అందించాలి

మక్తల్, నవంబర్ 21: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజెన్సీలు నాణ్యమైన పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈవో అనిల్ గౌడ్ సూచించారు. గురువారం సాయంత్రం ఎమ్మార్సీలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసే వంట ఏజెన్సీలు నాణ్యమైన కూరగాయలు, బియ్యాన్ని పరిశుభ్రంగా చేసిన తర్వాతనే వంట చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు వంటవారికి సహకరిస్తూ రోజువారీ పాఠశాలకు వచ్చే విద్యార్థుల ఉపస్థితిని వచ్చిన వాటికంటే ఎక్కువగా రాసి వంట ఏజెన్సీ వారికి అదనంగా బియ్యం అందిస్తున్నారని సమాచారం ఉందని, ఉపాధ్యాయులు టీఎ హెచ్ ఎంలు తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పాఠశాలలో వంట ఏజెన్సీ వారు పరిశుభ్రమైన పాత్రలలో భోజనాన్ని వండి విద్యార్థులకు వడ్డించాలన్నారు. ఉపాధ్యాయుల సూచనలు వంట ఏజెన్సీలు పాటించకపోతే తొలగించాలని సూచించారు. ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనానికి పరిశీలించిన తర్వాతనే విద్యార్థులకు వడ్డించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రాణాలు పోతున్నా పట్టింపు లేదా?

మక్తల్ నవంబర్ 21: నియోజకవర్గంలోని సర్కారు పాఠశాలల విద్యార్థుల ప్రాణాలు పోతున్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకుండా మొద్దు నిద్ర వహిస్తుందని మున్సిపల్ కౌన్సిలర్ ప్రసన్న ఆరోపించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం భోజనం తిన్న విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై ఇప్పటికీ ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతుందని ఆరోపించారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

పాలమూరు, నవంబర్21: గ్రంథాలయాలను విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయంలో సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం జీఎమ్మార్ హాజరై మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారమని, మంచి పుస్తకం వందమంది మిత్రులతో సమానమన్నారు. అనంతరం మల్లు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనిత, గ్రంథాలయ కార్యదర్శి మనోజ్ కుమార్, హర్షవర్ధన్, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న జీఎమ్మార్

నారాయణపేటలో బహుమతుల ప్రదానం

నారాయణపేట, నవంబర్ 21: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సరస్వతిమాత చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం గ్రంథాలయాల ఆవశ్యకత గురించి తెలియజేశారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, వైస్ చైర్మన్ హన్మంతు, కౌన్సిలర్ సలీం, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సురేశ్‌బాబు, లైబ్రేరియన్లు శిల్ప, భారతి తదితరులు పాల్గొన్నారు.

వందశాతం రుణమాఫీ కాలే..

● డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, నవంబర్ 21: ఇచ్చిన మాట మేరకు రైతులకు రుణమాఫీ చేస్తున్నామని కొంతమందికి సాంకేతిక కారణాలతో వందశాతం రుణమాఫీ కాలేదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రెండు లక్షలకు పైగా రుణాలు ఉన్నవారిని గుర్తిస్తున్నామని డిసెంబరు 9లోగా రుణమాఫీ చేస్తామన్నారు. పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురికావడం దురదృష్టకరం.. ఆ ఘటనపై శాఖాపరమైన విచారణకు ఆదేశించామని బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో హర్షవర్ధన్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మల్లు నర్సింహారెడ్డి సీజే.బెనహర్, ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు ఆన్‌లైన్ చేయాలి

● అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మూసాపేట(అడ్డాకుల), నవంబర్ 21: ధాన్యం సేకరించిన వెంటనే రైతుల ఖాతా, ధాన్యం వివరాలను ఆన్ లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ సూచించారు. అడ్డాకుల మండలంలోని పొన్నకల్‌లో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఎంతమంది రైతులతో ధాన్యం సేకరించారనే వివరాలపై ఆరా తీశారు. వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవి ఉంగా చూడాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కొనుగోలుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని మండల అధికారులను ఆదేశించారు.

రేషన్‌బియ్యం పట్టివేత

నవాబ్‌పేట, నవంబర్ 21: మండలంలోని మరికల్‌కు చెందిన వ్యాపారి రవీందర్ వద్ద గురువారం రేషన్ బియ్యం పట్టు కొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మరికల్‌కు చెందిన కిరాణా వ్యాపారి రవీందర్ కొంతకాలంగా రేషన్ బియ్యాన్ని వినియోగదారుల నుంచి తక్కువ ధరకు కొను గోలు చేసి బయటి మార్కెట్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు వివరించారు. విజిలెన్స్ అధికారులతో కలిసి దాడులు నిర్వహించి 6క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టు కొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ డీలర్ సస్పెండ్

జడ్చర్ల, నవంబర్ 21: మండలంలోని ఉదండాపూర్ రేషన్ డీలర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఈనెల 18న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలో రేషన్ దుకాణంలో చూయించిన రిజిస్టర్‌లో ఉండాల్సిన స్టాక్ కంటే అధికంగా బియ్యం స్టాక్ ఉన్నట్లు తేలింది. దీంతో నివేదికను పైఅధికారులకు అందజేశారు. పైఅధికారులు రేషన్ డీలర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

ఆయకట్టుకు నీరందించాలి

నారాయణపేట, నవంబర్ 21: పట్టణంలోని పళ్ల బజారు శివారులో కొండా డ్డెపల్లి చెరువు కింద ఉన్న ఆయకట్టుకు నీరందించాలని బీకేఎస్ జోనల్ సెక్రటరీ వెంకోబా కోరారు. గురువారం బీకేఎస్ నగర కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని తాసీల్దార్, నీటి పారుదలశాఖ అధికారి కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వానకాలం సీజన్‌లో కురిసిన భారీ వర్షాలకు కొండా డ్డెపల్లి చెరువు పూర్తిగా నిండిందని, వరి రెండో పంటకు నీటిని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభుమిస్కిన్, నగర అధ్యక్షుడు వెంకటప్ప, కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

హన్వాడ, నవంబర్ 21: ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఉన్న ధాన్యం కొను గోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాల్లో నేటికీ కొను గోలు చేపట్టలేదన్నారు. ఆరుగాలం పడించిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొస్తే నేటికీ కొను గోలు చేయక పోవడంతో ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. కొనుగోలు చేయకుంటే మండల కార్యాలయం ఎందుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. అనంతరం తాసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

బీమా సౌకర్యం కల్పించాలి

నారాయణపేట, నవంబర్ 21: రైతుబీమా మాదిరిగా మత్స్యకారులకు బీమా సౌకర్యం కల్పించాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరా ఘాగరాజు, మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు కాంత్‌కుమార్ అన్నారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ముదిరాజ్ మహాసభ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, వైస్ చైర్మన్ హన్మంతు, జిల్లా మత్స్యశాఖ అధికారి రహమాన్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు సహకారం ఇవ్వాలి

భూత్పూర్, నవంబర్ 21: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు కావాలని జిల్లా మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. గురువారం మత్స్య సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో కేక్ కట్‌చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు.

కేక్ కట్ చేసుకుంటున్న నాయకులు

ప్రభుత్వ స్థలాల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, నవంబర్ 21: జిల్లా మహిళా సమాఖ్య భవన నిర్మాణం నిమిత్తం గురువారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ సింగారం మలుపు దారిలోని కలెక్టరేట్ సముదాయ భవనం సమీపంలో, డీఆర్డీఏ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. జిల్లా మహిళా సమాఖ్య భవనం డిజైన్ ఆధారంగా స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం డీఆర్డీవో కార్యాలయం వెనుక మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోతున్న పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు.

ప్రాణాలతో చెలగాటమాడొద్దు!

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 21: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడొద్దని బీఆర్ఎస్‌వీ పీయూ కన్వీనర్ భరత్‌బాబు పేర్కొన్నారు. గురువారం జనరల్ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా భరత్‌బాబు మాట్లాడుతూ.. నాణ్యమైన ఆహారం అందించకపోవడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. సీఎం సొంత జిల్లాలో ఇలాంటి ఘటనలు జరగడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు తాయప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 21: రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో సత్తా చాటాలని డీవైఎస్‌వో శ్రీనివాసులు గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో స్టేడియం మైదానంలో నిర్వహించిన సాఫ్ట్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు తరలివెళ్లారు. ఎంపికైన క్రీడాకారులు మెదక్ జిల్లాలో ఈనెల 22నుంచి 24వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని కోచ్ సాధిక్ అలీ తెలిపారు. కార్యక్రమంలో ఆనంద్, నాగరాజ్, నాగమణి, మేరీ, పుష్ప పాల్గొన్నారు.

రగ్బీ పోటీలకు ఎంపిక

జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో గురువారం రగ్బీ పోటీలకు ఎంపికలు నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదా బాలు తెలిపారు. అండర్-14 విభాగంలో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 150మంది బాల బాలికలు పాల్గొన్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయిలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్, రగ్బీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీకారులను అభినందిస్తున్న శ్రీనివాసులు

ముగిసిన బ్రహ్మోత్సవం

● ఆత్మకూరు ఎస్‌బీఐకి చేరిన కురుమూర్తి స్వామి ఆభరణాలు

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), నవంబర్ 21: ఉమ్మడి పాలమూరు జిల్లాలో పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారులు తెలిపారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వజ్రవైఢూర్యాలతో కూడిన బంగారు ఆభరణాలను ఈ నెల 6వ తేదీన స్వామి వారికి అలంకరించారు. ఆలయ అర్చకులు గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతుల సమర్పణ అనంతరం, స్వర్ణాభరణాలను తీసి వాటి స్థానంలో వెండి ఆభరణాలను అలంకరించారు. బంగారు ఆభరణాలను దేవాదాయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కార్యనిర్వహణ అధికారి మధనేశ్వర్‌రెడ్డి, తాసీల్దార్, ఎస్సై శేఖర్, అమ్మాపూర్ సంస్థానాధీశులు శ్రీరాంభూపాల్, ఆలయ పాలక మండలి అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో దేవాదాయ అధికారులకు అప్పగించారు. అధికారులు ఆభరణాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆత్మకూర్ ఎస్‌బీఐ బ్యాంకుకు తరలించి భద్రపర్చనున్నట్లు ఈవో తెలిపారు. దీంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘట్టం ముగిసినట్లు పేర్కొన్నారు. కాగా, భక్తులు వచ్చే అమావాస్య వరకు జాతర కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆభరణాలను పరిశీలిస్తున్న అధికారులు

భారీగా కొండకు తరలి వచ్చిన భక్తులు

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తులు కురుమూర్తి కొండకు భారీ ఎత్తున తరలివచ్చారు. భక్తులు భక్తి శ్రద్ధలతో స్నానాలు ఆచరించి, స్వామి వారికి కొబ్బరి కాయలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి దర్శనానికి క్యూలైనులో భక్తులు బారులు తీరారు. గర్భగుడి దగ్గర స్వామిని దర్శించుకొని పునీతులయ్యారు.

హక్కులు కాపాడుదాం.. బాల్యవివాహాలు అరికడుదాం

● ఆర్డీఎస్ సంస్థ ప్రెసిడెంట్ చిన్నమ్మ థామస్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 21: బాలల హక్కులు కాపాడదాం.. బాల్య వివాహాలు అరికడుదామని రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సంస్థ ప్రెసిడెంట్ చిన్నమ్మథామస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యాక్సెస్ టు జస్టిస్ ప్రాజెక్టుతో కలిసి ఆర్ డీస్ సంస్థ పాలమూరులో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బాలల హక్కులు కాపాడడం, వేధింపులు, పిల్లల అక్రమ రవాణా, బాల్యవివాహాలు అరికట్టడంపై బాల్య వివాహాల విముక్త్ భారత్ అనే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రతిజ్ఞ, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బుధవారం దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు, పేదలు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు బాల్యవివాహాలపై మొగ్గు చూపుతున్నారన్నారు. సమావేశంలో మహబూబ్‌నగర్ జిల్లా కోఆర్డినేటర్ విశ్వకాంత్, వనపర్తి జిల్లా కోఆర్డినేటర్ ఎడ్విన్, సభ్యులు కన్నన్‌రాజ్, చెన్నమ్మ, జయ భారతి పాల్గొన్నారు.

బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఆర్డీఎస్ ప్రతినిధులు

వైద్యకళాశాలకు కన్నతల్లి పార్థివదేహం దానం

● ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖానకు కండ్లు
● కుమారుడికి పలువురి అభినందన

నవాబ్‌పేట, నవంబర్ 21: తల్లి పార్థివదేహం, కండ్లు సమాజానికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుమారుడు.. వైద్యకళాశాలకు, కండ్లు ఎల్వీ ప్రసాద్ దవాఖానకు అప్పగించిన ఘటన మండలంలోని లోకిరేవులో గురువారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన గోరెంక చెన్నమ్మ(90) అనారోగ్యంతో గురువారం ఉదయం జనరల్ దవాఖానలో మృతి చెందింది. వెంటనే పార్థివదేహాన్ని లోకిరేవులోని స్వగృహానికి తీసుకొచ్చారు. కాగా చెన్నమ్మ మృతదేహం పదిమందికి ఉపయోగపడాలనే లక్ష్యంతో ఆమె కుమారుడు గోరెంక కృష్ణ వైద్యవిద్యార్థుల సౌకర్యార్థం నారాయణపేట వైద్యకళాశాలకు అందజేయాలని నిర్ణయించుకున్నాడు. పేట వైద్యకళాశాల వైద్యులు, అధ్యాపకులు లోకిరేవుకు వచ్చి.. చెన్నమ్మ పార్థివదేహాన్ని తీసుకెళ్లారు. చెన్నమ్మ కండ్లను సైతం గురువారం ఉదయమే హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖానకు అందజేసినట్లు వివరించారు. కృష్ణను పలువురు మేధావులు, ఉద్యోగులు, నాయకులు, మండల ప్రజలు అభినందించారు.

ఉపాధ్యాయులను బలిచేయడం సరికాదు

నారాయణపేట రూరల్, నవంబర్ 21: మధ్యాహ్న భోజనం లోపం వల్ల జరిగిన పరిణామాలకు ఉపాధ్యాయులను బలిచేయడం సరికాదని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్ కృష్ణారెడ్డి, నర్సింహులు పేర్కొన్నారు. మాగనూర్ పాఠశాలలో బుధవారం జరిగిన ఘటనపై స్పందిస్తూ టీచర్లు పాఠాలు చెప్పాలో.. వంటలు చేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడిందన్నారు. సస్పెన్షన్‌కు గురైన హెచ్ఎం, ఇన్‌చార్జి హెచ్ఎంను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం బాధ్యతలపై ఉపాధ్యాయులు భయాందోళనలకు